


నవభూమి

జిల్లా అనుబంధం

16 సెప్టెంబర్,2024 సోమవారం | పేజీలు:5

www.epaper.navabhoomi.in


### ఎమ్మెల్యే బీవీని విమర్శించే స్థాయి

# అనామకునికి లేదు

- ప్యాకేజీల కోసం పార్టీలు మార్చే వాళ్ళ టిడిపి గురించి మాట్లాడటమా
- తెదేపా నాయకులు వెల్లడి



**ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 15 (నవభూమి):** ఎమ్మిగనూరు శాసనసభ్యులు బీవీ జయనాగేశ్వర రెడ్డిని విమర్శించే స్థాయి అనామకునికి లేదని హాలహార్వి,మాచాపురం గ్రామాల టిడిపి నేతలు అన్నారు.ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు దావీదు,హాలహార్వి మాజీ సర్పంచ్ దాసు, నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షులు మణికుమార్ మరియు మాచాపురం టిడిపి నాయకులు మా భాష,సుభాష్ చంద్రబోస్, ఆశీర్వాదం లు పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే బి వి జయనాగేశ్వర రెడ్డి ని విమర్షించే స్థాయి అనామకునికి లేదనీ ప్యాకేజీల కోసం పూటకు ఒక పార్టీ మార్చే టిడిపి పై తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటు, గురు రాఘవేంద్రప్రాజెక్టు గురించి మాట్లాడే వైసిపి నాయకులకు పార్టీలు మార్చే ఊసరవెల్లికి అర్హత లేదు. గతంలో2014 -19 వరకు టిడిపిలో ఉండి వైసిపి కి కోవర్టుగా పనిచేసి 33 ఎకరాల భూమిని ఎస్సీలకు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి చేతులు మీదగా పట్టాలు అందించినప్పుడు, వైసిపి లీడర్లు కుటుంబాలను ఎమ్మెల్యే దగ్గరకు పిలిపించి దండలు వేయించి బీవీ కి జేజేలు పలికించి ఇప్పుడు విమర్షించడం ఆ ఊసరవెల్లికే చెల్లుతుంది. అలాగే 2013లో వైసిపి ఊసరవెల్లితో లోపాయికారి ఒప్పందాలు పెట్టుకొని పోటీచేయక పోవడం ఇందుకు నిదర్శనం.2014 నుండి తెలుగుదేశం ప్రభుత్వంలో అధికారం మీద పెత్తనం చలాయించి ఏమీ ఏమీ చేశారో మా దగ్గర ఆధారాలు ఉన్నాయి.గురు రాఘవేంద్ర ప్రాజెక్టుకి ఎల్.ఎల్.సి. ప్రాజెక్టుకి ఎటువంటి సంబంధంలేదు కేవలం ఎల్.ఎల్.సి. బోర్డు నుండి ఆధారాలు సేకరించి వాటి ఆధారంగా నీటిని సక్రమంగా పారించలేదు అనడం శోచనీయం.ఎన్నికల సమయంలో అనామకుడు అహంతో టిడిపి ని వదిలి వెల్లిపోయినందుకు మతిస్థిమితం లేక ఏమి మాట్లాడుతున్నాడో అతనికే తెలియడం లేదు,అందుకని ఆనామకునికి ఎర్రగడ్డ పిచ్చి ఆసుపత్రి అయితే సరిపోతుందని విమర్శించారు. మొన్న విలేకరు సమావేశంలో మాచాపురం గ్రామ వైసిపి నాయకులు మాట్లాడుతూ చెరువులో నీళ్లు లేవనడం చాలా విడ్డూరంగా ఉంది. ఎల్ ఎల్ సి అధికారులతో మాట్లాడి చెరువుకు నీళ్లు తెప్పించిన ఘనత మా ఎమ్మెల్యే బీవి దక్కుతుందని అని అన్నారు. అనామకునికి టీఎంసీ అంటే తెలియదు అటువంటి వ్యక్తి మా బీవీ జయనాగేశ్వర రెడ్డిని విమర్శించడం సరికాదని, టిడిపి పై తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటు గురు రాఘవేంద్ర ప్రాజెక్టు గురించి మాట్లాడే నైతిక అర్హత వైసిపి నాయకులకు లేదని, మీరు మాట్లాడిన ప్రతి మాట చేసిన ప్రతి విమర్శ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. వైసిపి విసిరిన సవాలకు తెదేపా సిద్ధంగా ఉంది ఎప్పుడైనా సరే అని అన్నారు. గురు రాఘవేంద్ర ప్రాజెక్టు ద్వారా ప్రతి ఎకరాకు సాగునీటిని అందించడమే ఎమ్మెల్యే బీవీ ధ్యేయమని అన్నారు.ఈ కార్యక్రమంలో హాలహార్వి టిడిపి గ్రామ అధ్యక్షులు నాగరాజు, బోడి స్వామి, జగ్గాపురం నరసింహులు,హాలహార్వి మరియు మాచాపురం తెదేపా నాయకులు జగన్నాథ్ రెడ్డి ,గోవిందు,ముక్కరన్న,జి దుబ్బన్న,వెంకన్న, శ్రీనివాసులు, ప్రేమ్ కుమార్, కాజా మా భాష భాష బాలరాజు, నరసింహులు, ఆంజనేయ, రసూల్, భాస్కర్, ఉరుకుందు, ప్రభాకర్, ఇమ్మానియేల్, ఏసేపు, రత్నం, అశోక్, రంగన్న, చిన్నన్న, దేవ సహాయం తదితరులు పాల్గొన్నారు.

### అర్ధాంతరంగా నిలిచిన

# పైపులైన్ పనులు

**పొదిలి, -నవభూమి:** దర్శి ఎన్ఏపీ కెనాల్ నుంచి పొదిలి పెద్దచెరువుకు పైపులైన్ల ద్వారా నీటిని నింపే భూగర్భ పైపులైన్ నిర్మాణ పనులు ఆగిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు హడావిడిగా ప్రారంభించి అర్ధాంతరంగా ఆపేశారు. 2023 ఏప్రిల్ నెల 12వ తేదీన ముఖ్యమంత్రి హెూదాలో జగన్మోహన్‌రెడ్డి మార్కాపురం వచ్చినప్పుడు వర్చువల్‌గా శిలాఫలకం ఆవిష్కరించి పనులు ప్రారంభించారు. 15 నెలలు పనులు జరిగినా కేవలం ఐదు కిలోమీటర్లకు మించి పైపులైన్ పూర్తి చేయలేదు. అందులోను మల్లవరం గ్రామంలో పైపులైన్‌కు గుంతలు తీయనీయకపోవడంతో గ్రామం దాటిన తరువాత గోతులు తీశారు. మళ్లీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందో..? రాదోనని రాజంపల్లి గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపుల పైపులు తోలారు. కాంట్రాక్టర్ చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు పూర్తిగా ఆగిపోయాయి. దీంతో పొదిలి ప్రజలు తాగునీటి సమస్య ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. పట్టణంలో భూగర్భజలాలు పాతాళానికి చేరాయి. పట్టణానికి ప్రధాన నీటి వనరుగా ఉన్న చెరువులు రెండు దశాబ్దకాలంగా నీటి చుక్కలేకుండా ఎండిపోయాయి. ఆ ప్రభావం పట్టణంపై పడింది. బోర్లు పూర్తిగా ఎండిపోయాయి.ఆరునెలల్లో పూర్తిచేస్తామని నాడు హామీ ముఖ్యమంత్రి నాడు పనులు ప్రారంభించగా, ఆరు నెలల్లో పనులు పూర్తి చేస్తామని నాటి ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి హామీ ఇచ్చారు. ఆ మాటలను ప్రజలు నమ్మి తాగునీటి సమస్య తీరుతుందని ఆశపడ్డారు. అయితే ప్రజల ఆశలు అడియాశలుగానే మిగిలి పోయాయి. పైపులైన్ నిర్మాణ పనులకు సుమారుగా రూ.40 కోట్లతో ప్రారంభించారు. కాంట్రాక్టర్ పదికోట్ల పనులు చేసినా ప్రభుత్వం చిల్లిగవ్వకూడా బిల్లులు ఇవ్వలేదు. దీంతో పనులు మధ్యలోనే కాంట్రాక్టర్ నిలిపేశాడు. చేసిన పనులకు కూడా బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు చేయడానికి ఎవరు ముందకు రాక రోడ్ల వెంబడి తోలిన పైపులు కూడా నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఈ పనులు ప్రారంభించి పూర్తి చేస్తే సాగర్‌నీటితో రెండు చెరువులకు నింపితే పట్టణంలో భూగర్భ జలాలు పెరిగి కొంతమేరకు నీటి కష్టాలు తీరుతాయని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మల్లవరం వరకు పైపులైన్ నిర్మాణం పూర్తి చేశారు. అయితే ప్రజలు కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత ప్రజల్లో ఆశలు మళ్లీ రేకెత్తాయి. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకొని పైపులైన్ నిర్మాణం పనులు వేగవంతమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# జనద్రోహిగా జగన్



## వైభవంగా శ్రీ సిద్ధి బుద్ధి వినాయక స్వామి వారి కళ్యాణం



**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 15(నవభూమి):** జగ్గయ్యపేట: పట్టణంలో బంగారపు కొట్ల సెంటర్లో వేంచేసియున్న శ్రీ స్వయంభువు విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం రాత్రి శ్రీ సిద్ధి, బుద్ధి వినాయక స్వామి వార్ల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రముఖ బంగారపు వ్యాపారులు లిశ్రీరాం సీతారామమూర్తి, జయరామ్ దంపతులులి కళ్యాణ పీటలపై కూర్చోన్నగా, వేద పండి తులు బ్రహ్మశ్రీ లిపిల్లలమర్రి నాగకృష్ణశర్మ, ఆంజనేయ శర్మలులి కళ్యాణాన్ని జరిపించారు. దేవస్థానం అర్చకులు అర్చకులు లిభరద్వాజ శర్మలి కళ్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బంగారు వ్యాపారులు, భక్తులు కార్యక్రమంలో భారీగా పాల్గొన్నారు.

## ఆరోగ్య అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి



**విస్సన్నపేట, సెప్టెంబర్ 15(నవభూమి):** కనకపూడి రామారావు, పాల్ ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఉద్దేశించి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ విసన్నపేట పరిసర ప్రాంత ప్రజలకు ఉపయోగపడేలాగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన కొలికపూడి రామారావు బ్రదర్స్ ను అభినందించారు వైద్య శిబిరాలతో పాటు ఆరోగ్యం పట్ల అవగాహన ప్రజల్లో కలిగించాలని చంద్రబాబు తీసుకువచ్చిన సేంద్రియ వ్యవసాయ విధానాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని ఆరోగ్యం ఉండేలాగా ఆహారపు అలవాట్లను కూడా మార్చుకోవాలని నాగేశ్వరరెడ్డి కోరారు.

## రైతు కుటుంబానికి ఆర్థిక చేయూత

### చెక్కును అందజేసిన ఎమ్మెల్యే కృష్ణప్రసాదు గారు

**ఇబ్రహీంపట్నం, (మూలపాడు) ,సెప్టెంబర్ 15(నవ భూమి):** మృతి చెందిన మహిళా రైతు కుటుంబానికి సొసైటీ ద్వారా మంజూరైన ఆర్థిక సాయాన్ని స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు ఆదివారం అందజేశారు. ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు గ్రామానికి చెందిన నిమ్మగడ్డ నారాయణరావు సతీమణి భారతి ఇటీవల మృతి చెందారు. సొసైటీలో రుణగ్రస్తురాలైన మహిళా రైతుకు సొసైటీ నుంచి రూ.1 లక్ష ఇన్సూరెన్స్ సొమ్ము మంజూరైంది. ఈ సొమ్మును చెక్కు రూపంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు..నిమ్మగడ్డ నారాయణరావుకి మూలపాడు గ్రామంలో ఆదివారం అందజేశారు. స్థానిక ఎన్డీఏ మహాకూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



### అద్భుత వ్యాపార వృద్ధిని ప్రసాదించే

# గోమతి చక్ర ప్రయోగం




**జగ్గయ్య పేట, సెప్టెంబర్ 15(నవభూమి):** మీ ప్రస్తుత వ్యాపారంలో లేదా మీరు ప్రారంభించబోయే కొత్త వ్యాపారంలో అద్భుత విజయాన్ని పొందడానికి ఈ తంత్ర పరిహారం చేయవచ్చు. ఈ తంత్ర ప్రయోగం మీ వ్యాపారాన్ని అత్యంత లాభదాయకంగా, విజయవంతంగా, సంపన్నంగా చేస్తుంది. గోమతి చక్రం చాలా శక్తివంతమైన, సులభంగా లభించే ఒక గొప్ప తంత్ర వస్తువు. గోమతి చక్రం డబ్బును ఆకర్షించడానికి, ఆర్థిక శ్రేయస్సు ను పొందడానికి మరియు సవాలు చేసే కష్టమైన పనులలో విజయం సాధించడానికి మరియు ఇతర అనేక తంత్ర పరిహారాల్లో విస్తృతంగా ఉపయోగించబడుతుంది. గోమతి చక్రం శ్రీ మహా లక్ష్మి దేవి మరియు శ్రీ మహా విష్ణువు యొక్క అనుగ్రహాన్ని ప్రసాదిస్తుంది. గోమతి చక్రం దానిని ఆరాధించే ప్రతి ఒక్కరికి మంచి ఆరోగ్యం, దీర్ఘాయువు, అదృష్టం, సంపద మరియు శ్రేయస్సును ఇస్తుంది. ఈ తంత్ర ప్రయోగం చేయడానికి మీరు 11 గోమతి చక్రాలు, ఒక కొబ్బరి కాయ మరియు ఒక ఎరుపు రంగు పత్తి వస్త్రం సమకూర్చుకోవాలి. అన్ని వస్తువులను సమకూర్చుకున్న తరువాత మీరు ఒక శుభ తిథి వున్న శుక్రవారం నాడు తెల్లవారి సూర్యోదయ సమయంలో, తల స్నానం చేసి, శుభ్రమైన బట్టలు ధరించి, గోమతి చక్రాలను మొదట పాలతో, తరువాత నీటితో కడగాలి. కడిగిన తరువాత శు భ్రంగా తుడిచి ఎరుపు రంగు కొత్త పత్తి వస్త్రం పైన ఉంచాలి. మీరు కొబ్బరిని కాయను కూడా గోమతి చక్రాలతో పాటు ఎరుపు రంగు పత్తి వస్త్రం పై ఉంచాలి. మీరు ఈ వస్తువులన్నింటినీ మీ ముందు ఒక చెక్క పీట మీద పెట్టుకోవాలి. ఈ వస్తువులు అన్నింటిని మీరు మీ పూజ మందిరం లో కానీ లేదా ఒక శుభ్రమైన ప్రదేశంలో కానీ పెట్టుకోవాలి. ఈ వస్తువులకు మీరు ఏ విధమైన పూజ చేయాల్సిన అవసరం లేదు. పూలు కానీ, దీప ధూప నైవేద్యాలు కానీ సమర్పించాల్సిన అవసరం లేదు. ఈ వస్తువులన్నింటినీ మీ ముందు పెట్టుకున్న తరువాత, మీరు ఈ క్రింది మంత్రాన్ని 11 మాలలు అంటే 1188 సార్లు జపించి ఈ వస్తువులను శక్తివంతం చేయాలి. (11 మాలలు జపించాలి అంటే11 %ఇ 108 =% 1188 సార్లు జపించాలి అని అర్థం). మంత్రం: " ఐం క్లీం శ్రీం " మంత్రం చాలా చిన్నది కావడం చేత, గరిష్టంగా ఒకటి లేదా రెండు గంటలలో మీరు 11 మాలల మంత్ర జపాన్ని పూర్తి చేయవచ్చు. మీరు మంత్ర జపాన్ని లెక్కించడం కోసం 108 పూసలు కలిగిన రుద్రాక్ష మాలాను ఉపయోగించవచ్చు. మీరు 11 మాలలు అంటే 11 %ఇ 108 =% 1188 సార్లు మంత్రాన్ని జపించాలి. పై మంత్రంలో " ఐం " అన్నది శు భాన్ని, భాగ్యాన్ని, అదృష్టాన్ని ప్రసాదించే సరస్వతీ బీజం. " క్లీం " అన్నది బలమైన వశీకరణ శక్తిని, ఆకర్షణ శక్తిని ప్రయోగించే మన్మథ బీజం. " క్లీం " బీజం గొప్ప వ్యాపార విజయానికి మంచి ఆకర్షణ శక్తిని మీ వ్యాపారాలకు ఇస్తుంది. " శ్రీం " అన్నది లక్ష్మీ బీజం. ఈ బీజం ధనాన్ని, ఐశ్వర్యాన్ని, సంపదలను ఆకర్షించి మీ వ్యాపారానికి గొప్ప ఆర్థిక శ్రేయస్సు ని ఇస్తుంది. 1188 సార్లు మంత్ర జపం చేసి ఎరుపు రంగు వస్త్రంలో ఉంచిన అన్ని వస్తువులను శక్తివంతం చేసిన తరువాత, మీరు అన్ని వస్తువులను ఎరుపు రంగు వస్త్రం లోపలే ఉంచి, వస్త్రాన్ని బాగా చుట్టి, ఒక ఎరుపు రంగు దారం తో గట్టిగా మూట కట్టాలి. ఈ మూటను మీ కార్యాలయం, దుకాణం లేదా వ్యాపార ప్రాంగణం యొక్క ప్రధాన ద్వారం బైట పక్క, ముందు వైపున, ఎగువ భాగంలో కట్టి వేలాడదీయాలి. శక్తివంతం చేయబడిన ఈ తాంత్రిక వస్తువులు మీ వ్యాపారానికి ఎక్కువ మంది వినియోగదారులను, కస్టమర్లను, క్లయింట్లను ఆకర్షిస్తుంది. మీ వ్యాపారానికి గొప్ప అదృష్టాన్ని, శుభాన్ని, వ్యాపార వృద్ధిని ప్రసాదిస్తుంది. మంచి ధనాకర్షణతో మీ వ్యాపారానికి అద్భుత ఆర్థిక శ్రేయస్సును అందిస్తుంది.

### వరద బాధితులకు వంట సామాగ్రి,హెూమియో మెడిసిన్

## పంపిణీ చేసిన కమ్మవారి ఐక్య సేవాసమితి ఆంధ్ర ప్రదేశ్





**హనుమాన్ జంక్షన్, సెప్టెంబర్ 15 :** బాపులపాడు మండలం రంగయ్య అప్పారావుపేట గ్రామం బుడమేరు వరదల వల్ల జలదిగ్బంధంలోకి వెళ్ళింది. నివాస గృహాలు, పంట పొలాలు నీట మునిగాయి. గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాలు మేరకు అధికారులు గ్రామపంచాయతీ ఆఫీసులో 200 మంది వరద బాధితుల శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలోని వారందరికీ కమ్మవారి ఐక్య సేవా సమితి ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో జ్వరం, కీళ్ల నొప్పులు, స్కిన్ ఎలర్జీ నివారణకు హెూమియో మందులు పంపిణీ చేయడం జరిగింది. బాధితులకు రెండు భోజనం ప్లేట్లు, రెండు గిన్నెలు, రెండు ప్లేట్ల తో కూడిన వంట సామాగ్రి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సమితి అధ్యక్షులు పరుచూరి రామకృష్ణ మాట్లాడుతూ పకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధితులను ఆదుకోవడంలో కమ్మవారి ఐక్య సేవా సమితి ముందు ఉంటుందని కరోనా సమయంలో 6000 మందికి హెూమియో మెడిసిన్, 4,000 మందికి ఆయుర్వేద మెడిసిన్, మాస్కులు శానిటైజర్లు శానిటైజర్లు, పేస్ షీల్డ్ మాస్కులు అందజేసినట్లు తెలియజేశారు. సమితి గౌరవ సలహాదారులు అట్లూరి రాజశేఖర్ మాట్లాడుతూ సమితి ద్వారా నిరుపేద విద్యార్థులకు, ఉపకార వేతనాలు, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సహాయం వంటి అనేక సేవా కార్యక్రమాలు సమితి ద్వారా చేస్తున్నామని అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు, ఆహారం మందులు సమకూర్చటంలో సమితి ముందు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సహాయ కార్యదర్శి పొట్లూరి సత్య పనేంద్ర కుమార్, కొల్లిపర శ్రీనివాస్ , లింగం శ్రీధర్, కొమ్మినేని శివ తదితరులు పాల్గొన్నారు.

# జనద్రోహిగా జగన్

◆ గన్నే ప్రసాద్ (అన్నా) టిడిపి రాష్ట్ర కార్యదర్శి

**నవ్యాంధ్రప్రదేశ్** నవ్యాంధ్రప్రదేశ్ కు జగన్ పాలనే పెద్ద విపత్తు, రాష్ట్రాన్ని ఓ ఆదాయ వనరుగా మార్చుకుని లక్ష కోట్లు రూపాయలు ప్రజా ధనాన్ని జగన్ అండ్ కో కొల్లగొట్టారు. రాష్ట్ర మౌళిక అవసరాలను సైతం వదిలేసి అడ్డగోలుగా సంపాదించుకున్నారు. సాగు నీటి ప్రోజెక్టు నిర్వహణ చేయకుండా, విస్తరణ చేయకుండా కబ్జాలతో బుడమేరును , రివర్స్ ట్రెండరింగ్ అంటూ ఏలేరు రిజర్వాయర్ పనులు నిలిపివేయటంతో నేటి విపత్తులకు కారణమైంది. అనుభవజ్ఞులైన ముఖ్యమంత్రి చంద్రబాబు సారధ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అంతా కష్టపడి పనిచేయడంతో పెను ప్రమాదాలు తప్పాయి. నాటి చంద్రబాబు హయాంలో మంజూరు చేసిన బుడమేరు విస్తరణ ఏలూరు రిజర్వాయర్ పనులు కొనసాగించి ఉంటే ఇంతటి విపత్తు వచ్చి ఉండేది కాదు. 2003లో 40 వేల క్యూసెక్కుల భారీ వరద వస్తే గాని మునగని ఏలేరు ఇప్పుడు కేవలం 17 వేల క్యూసెక్కులకే మునిగిపోయి అపార పంటతో రైతులకు నష్టం జరిగింది. జగన్ రెడ్డి చేసిన రాష్ట్ర ఖజానా దోపిడితో రాష్ట్రం ఇంకా ఎన్ని విపత్తులను ఎదుర్కోవాలో అనే అనుమానం కలుగుతుంది. ప్రజలు జగన్ కు ఓటుతో బుద్ధి చెప్పినా అతని తీరు మారలేదు, విపత్తుల సమయంలో సైతం కుట్రలు, వెక్కిలి చేష్టలు చేయడం అతని నీచ బుద్ధికి నిదర్శనం.



ఇలాంటి వ్యక్తులు దేశానికి, సమాజానికి పెను ప్రమాదం. ఇంత విధ్వంసం, కుట్రలు, దోపిడీలు చేసిన జగన్ రెడ్డి రాష్ట్ర చరిత్రలో జనద్రోహిగా మిగిలిపోతాడని గన్నే పాత్రికేయుల సమావేశంలో . పేర్కొన్నారు

# ఇంకా పొరుగు మద్యమే



**(ఇచ్ఛాపురం)–నవభూమి:** జిల్లాలో పొరుగు మద్యం, సారా ఏరులై పారుతోంది. ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట ఒడిశా మద్యం పట్టుబడుతూనే ఉంది. కొంతమంది బ్రాండెడ్ పేరిట నకిలీ మద్యాన్ని చలామణి చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ మద్యం దుకాణంలో నాసిరకం, కొత్త బ్రాండ్లే దొరుకుతున్నాయి. ఒడిశాలో మాత్రం అన్నిరకాల బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి. అందుకే వాటిని తెచ్చి జిల్లాలో విక్రయిస్తున్నారు. అయితే వాటి పేరిట ఇప్పుడు నకిలీ మద్యం చలామణి చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా.. ఒడిశాకు ఆనుకుని ఉంది. జిల్లాలో సగానికిపైగా మండలాలు ఒడిశా సరిహద్దులో ఉన్నాయి. ఒడిశాలోని గంజాం, గజపతి జిల్లాలకు మన జిల్లా నుంచి మార్గాలు అధికం. మొన్న సార్వత్రిక ఎన్నికల్లో ఒడిశా మద్యం ఎక్కువగా జిల్లాకు చేరుకుంది. ఇప్పటికీ దానికి బ్రేక్ పడడం లేదు. ఒడిశా నుంచి తెస్తున్న మద్యాన్ని కొందరు నకిలీగా మారుస్తున్నారు. ఈ మద్యం తాగితే అనారోగ్యం కొని తెచ్చుకున్నట్టే. నిషా ఎక్కువగా వచ్చేందుకు కొన్ని రసాయనాలను కలుపుతున్నారు. బ్యాటరీ గుండతో పాటు ఇతరత్రా వ్యర్థ పదార్థాలను సైతం కలిపి.. సీసాల్లో నకిలీ మద్యాన్ని నింపుతున్నారు. ఆపై అచ్చం ఒడిశా, తెలంగాణ ప్రభుత్వాల ఎక్సైజ్ ముద్రలను అతికిస్తారు. ముందుగా ఏర్పాటుచేసుకున్న ముఠా ద్వారా వాటిని చలామణి చేస్తున్నారు. అలాగే పట్టణం, పల్లె అన్న తేడా లేకుండా సారా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ప్యాకెట్ రూ.50 నుంచి రూ.70 కు లభిస్తుండడం.. మంచి కిక్ ఇస్తుండడంతో ఎక్కువమంది మందుబాబులు సారానే తాగుతున్నారు. వ్యాపారులు ఒడిశా నుంచి రోడ్డు, రైలు, చివరకు నాటుపడవల ద్వారా సైతం సారాను జిల్లాకు చేర్చుతున్నారు. మూతపడిన చెక్‌పోస్టులు జిల్లాలో అక్రమ మద్యం, సారా రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఉన్నా పెద్దగా పనిచేయలేకపోతోంది. గత వైసీపీ ప్రభుత్వం అనాలోచితంగా ఆలోచించి ఎక్సైజ్ శాఖను విభజించింది. దీంతో పోలీసులే సాధారణ తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయగలుగుతున్నారు. అటు అంతర్ జిల్లా, రాష్ట్ర సరిహద్దులో ఉన్న చెక్ పోస్టులను సైతం ఎత్తివేశారు. అక్కడ తనిఖీలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ స్పెషల్ పోలీసులను రిక్రూట్ చేసింది. మాజీ సైనికులకు స్పెషల్ పోలసులుగా నియమించి సారా, మద్యం రవాణా నియంత్రణ బాధ్యతలు అప్పగించింది. కానీ కొద్దిరోజులకే విధుల నుంచి తొలగించింది. చెక్‌పోస్టులు కూడా మూతపడ్డాయి. దీంతో ఒడిశా నుంచి మద్యం, సారాను జిల్లాకు తెచ్చి విక్రయిస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సెబ్‌ను రద్దు చేసింది. ఈ నేపథ్యంలో మద్యం, సారా అక్రమ రవాణా అడ్డుకట్టపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. నకిలీ మద్యం ప్రాణంతాకం మద్యం ఆరోగ్యానికి హానికరం. నకిలీ మద్యం తాగితే ప్రాణాంతకం. ప్రధానంగా ఊపిరితిత్తులను హరిస్తాయి. నాడీ వ్యవస్థను దెబ్బతీస్తాయి. మత్తు ఇవ్వాలనే ఉద్దేశంతో రకరకాల రసాయనాలు వినియోగిస్తారు. రంగు కోసం ఉత్ప్రేరకాలను వాడుతారు. అవి చాలా ప్రమాదకరం. అవయవాల పనితీరుపై ప్రభావం చూపుతాయి. అందుకే వీలైనంత వరకూ మద్యానికి దూరంగా ఉండడమే మంచిది. డాక్టర్ పాతిర్ల దేవేంద్రరెడ్డి, సీహెచ్‌సీ సూపరింటెండెంట్, ఇచ్ఛాపురం అక్రమ మద్యం రవాణాపై నిఘా ఒడిశా నుంచి మద్యం అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేకంగా ఇంటెలిజెన్స్ టీమ్‌తో నిఘా కూడా పెట్టాం. ఇటీవల 101 కేసులు నమోదుతో పాటు 102 మందిని అరెస్ట్ చేశాం. 578 బీర్ బాటిల్స్, భారీగా మద్యం బాటిల్స్, 12 వెహికల్స్ సీజ్ చేశాం.

## మహాగణనాధునికి ప్రత్యేక పూజలు చేసిన దేవినేని ఉమామహేశ్వర రావు





**గొల్లపూడి, సెప్టెంబర్ 15(నవభూమి):** ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో గణేష్ నవరాత్రులను పురస్కరించుకుని ఆదివారం నాడు శ్రీనివాస నగర్ లో శ్రీ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహాగణనాధునికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు దేవినేని ఉమా అన్నదానం చేశారు. ఈరోజు సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సవ సమితి నిర్వహించనుంది. పది రోజుల పాటు మహా గణపతి భక్తుల పూజలు అందుకున్న మీదట ఈ నెల 16 వ తేదీన ఘనంగా నిమజ్జన వేడుక జరుగనుంది.

## నిత్యావసరాలు అందజేసిన ఎమ్మెల్యే కృష్ణప్రసాదు

**విజయవాడ, సెప్టెంబర్15(నవభూమి):** కీ.శే ఆరుద్ర అంక వరప్రసాద్ 10 వ వర్ధంతి సందర్భంగా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి రామరాజ్య నగర్ లో వరద బాధితుల సహాయార్థం నిత్యవసర వస్తువులు బియ్యం మరియు కూరగాయలు పంపిణీ కార్యక్రమంలో మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదివారం పాల్గొన్నారు. మంగళగిరి నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి సౌజన్యంతో అక్కడి వరద బాధితులకు నిత్యవసర వస్తువులను స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ అక్కల రామ్మోహనరావు (గాంధీ) , టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



## పారిశుధ్యం పనులు నిర్వహించిన పంచాయతీ పాలకవర్గం



**కొత్తపేట, నవభూమి:** తమ సమస్యల పరిష్కారం కోసం కొత్తపేట పంచాయతీ పారిశుధ్య కార్మికులు గత ఐదు రోజులుగా విధులను బహిష్కరించి సమ్మెకు దిగారు. సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కరరావు పాలకవర్గం సభ్యులు సెక్రటరీ వివి రామన్ వారితో మాట్లాడి రెండు రోజుల్లో వేతనాలు చెల్లిస్తామని నచ్చ చెప్పినా వినకుండా వారు విధులకు దుమ్మా కొట్టి సమ్మె కొనసాగించారు. దాంతో ఆ గ్రామం లోని పలు ప్రాంతాల్లో చెత్త విపరీతంగా పేరుకుపోయింది. దాంతో ఆదివారం వేరే ప్రాంతానికి చెందిన పారిశుధ్య కార్మికులను తీసుకొచ్చి సర్పంచ్ బూసిజయలక్ష్మి భాస్కర్ రావు, పాలకవర్గ సభ్యులు వారితో కలిసిన గ్రామం అంతటా పారిశుధ్య పనులు నిర్వహించారు. పేరుకుపోయిన చెత్తను ఎత్తి బయటికి తరలించారు. అలాగే సంత మార్కెట్లో బ్లీచింగ్ జల్లారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వీళ్ళ మారుతీ ప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు, పంచాయతీ సభ్యులు కాశి రాజు, కదలి భీమేష్ ,బయ్యే రాంబాబు,, బండిరాజు, ,లంక సుబ్రహ్మణ్యం,టీడీపీ నేతలు కముజు వెంకటేశ్వరరావు,దేవపాటి వెంకటేశ్వరరావు, చొడపనీడి భాస్కరరావు, ఎల్లమెల్లి జగన్మోహన్,వాసంశెట్టి సత్యనారాయణ, బూసి వెంకటరమణ,కుడుపూడి శ్రీనివాసరావు,శీలం సూర్యచంద్రరావు,ములపర్తి శ్రీను, మట్టా బాలు, ముద్రగడ ఫణి,బూసి విష్ణు,తదితరులు పాల్గొన్నారు.

## మాడుగుల ముఖం చూడక పది రోజులు అవుతున్న బస్సులు



**మాడుగుల సెప్టెంబర్ 16 నవభూమి** నియోజక వర్గ కేంద్రం మాడుగుల కు సుమారు పది రోజులు గా బస్సులు రాకపోవడం తో ప్రయాణికుల అవస్థలు పడుతున్నారు.ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వడ్డాది దగ్గర విజయ రామరాజు పేట తాచేరు బ్రిడ్జి వద్ద కాజువే కొట్టుకుపోయింది. అప్పటి నుంచి నేటి వరకూ మాడుగుల కు బస్సులు రావడం లేదు.దీంతో మాడుగుల కు మాడుగుల నుంచి ఇతర దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అత్యవసర పనుల మీద బయటకు వెళ్ళే వాళ్ళు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కావున తాచేరు బ్రిడ్జి కాజువే ను పూర్తి చేసి బస్సులు మాడుగుల కు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు.

## రాజ్యాధికారాన్ని దూరం చేసేందుకే ఎస్సీ వర్గీకరణ

**ఒంగోలు -నవభూమి:** దళితులకు రాజ్యాధి కారాన్ని దూరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణను తెరపైకి తెచ్చాయని జైభీమ్ భారత్ పార్టీ అధ్యక్షుడు జడా శ్రావణ్‌కుమార్ విమర్శించారు. ఎస్సీ వర్గీ కరణను వ్యతిరేకిస్తూ 'హలో మాల.. చలో ఒంగోలు' పేరు తో సోమవారం మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్‌భవన్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. వర్గీకరణపై వచ్చిన తీర్పును ఆయా రాష్ట్రా లు అమలు చేయకుండా నిలువరించే విధంగా ఉద్యమా లు చేయాలని పిలుపునిచ్చారు. జనాభాలో ఐక్యంగా ఉన్న 25 శాతం మంది మధ్య వర్గీకరణ చిచ్చు పెట్టి రాజకీయ లబ్ది పొందాలని పాలకులు చూస్తున్నారని ధ్వజమెత్తారు.

# అవసరమైన రైళ్లు ఇవ్వరా?

**విశాఖపట్నం-నవభూమి:** ఉత్తరాంధ్ర కేంద్రంగా విరాజిల్లుతున్న విశాఖపట్నం నుంచి ప్రధాన నగరాలకు రైలు సర్వీసులు చాలా తక్కువ. ఎన్నాళ్ల నుంచో అధికారులను, మంత్రులను కొత్త రైళ్లు వేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. కానీ ఎవరూ అడగకుండానే వందే భారత్ రైళ్లను ఎడాపెడా ప్రారంభించేస్తున్నారు. మొదట విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య వందేభారత్ రైలు ప్రారంభించారు. మరో కొత్త రైలు తక్కువ సమయంలో వెళ్లేది అందుబాటులోకి వచ్చిందని అంతా సంతోషించారు. ఆ తరువాత విశాఖ నుంచి పూరీకి మరో వందేభారత్ రైలు ప్రారంభించారు. దీనిని ఉత్తరాంధ్ర ప్రజలు ఎవరూ కోరుకోలేదు. రైల్వే మంత్రి ఒడిశాకు చెందినవారు కావడంతో ఆ ప్రాంత ప్రజలు త్వరగా విశాఖపట్నం రావడానికి వీలుగా ఈ వందేభారత్ వేసుకున్నారు. ఆ తరువాత విశాఖ-సికింద్రాబాద్‌లకు మంచి డిమాండ్ ఉండడంతో అదనపు వందేభారత్ రైలు ఇచ్చారు. అంతా సంతోషించారు. ఇప్పుడు ఈ నెల 17వ తేదీన అంటే మంగళవారం కొత్తగా మరో వందేభారత్ రైలు విశాఖ నుంచి దుర్గ్‌కు నడుపుతున్నారు. ఇది రాయగడ, టిట్లాఘర్ మీదుగా దుర్గ్ వెళుతుంది. దుర్గ్‌కు వందేభారత్ కావాలని ఉత్తరాంధ్ర ప్రజలు ఎవరినీ అడగలేదు. కానీ అక్కడి వారికి ఉపయోగపడుతుందని దానిని ప్రారంభిస్తున్నారు. కోరకుండా వరాలు ప్రసాదిస్తున్న కేంద్రంలోని పెద్దలు ఎన్నో ఏళ్లుగా అడుగుతున్న రైళ్లను ఎందుకు ఇవ్వడం లేదన్నదే ఇక్కడ పెద్ద ప్రశ్న. ఈ విషయంలో మన ఉత్తరాంధ్ర ఎంపీలు ఎందుకు ఢిల్లీ పెద్దలను నిలదీయడం లేదో ఎవరికీ తెలియదు. ఇప్పుడు కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వానికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. మన అవసరాలు, ప్రజల డిమాండ్లను తెలియజేసి వాటిని సాధించుకోవచ్చు.బెంగళూరుకు విశాఖ నుంచి రైలు ఏదీ? ఉత్తరాంధ్రాకు చెందినవారు చాలామంది బెంగళూరులో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్నారు. తరచుగా రాకపోకలు



సాగిస్తున్నారు. గతంలో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ విశాఖ నుంచే బెంగళూరు వెళ్లేది. తూర్పు కోస్తా రైల్వే జోన్ పెద్దలు దీనిని భువనేశ్వర్‌కు తీసుకుపోయారు. దాంతో విశాఖ కోటా సీట్లు తగ్గిపోయాయి. బెంగళూరుకు డిమాండ్ ఉండడంతో ప్రత్యేక రైలు నడుపుతున్నారు. అడపాదడపా నడపడం, ఆ తరువాత ఆపేయడం చేస్తున్నారు. దీనిని రెగ్యులర్‌గా నడపాలని చాలాకాలంగా ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. అయినా పట్టించుకోవడం లేదు. విశాఖపట్నం-బెంగళూరు మధ్య ప్రయాణం ఒకరోజు పడుతుంది. ఈ మార్గంలో అత్యంత వేగంగా ప్రయాణించే వందేభారత్ రైలు నడిపితే ఎంతో ప్రయోజనం. దీనిని పట్టించుకోకుండా దుర్గ్‌కు ఎందుకు వేశారో అర్థం కావడం లేదు. ఈసారి విశాఖకు మరో వందేభారత్ అంటే అది బెంగళూరుకు నడిపేలా ఎంపీలు యత్నించాలి.తిరుపతికి గరీబ్ రథ్ ఎక్కడ? ఉత్తరాంధ్ర నుంచి ప్రతిరోజూ వేలాది మంది తిరుపతి వెళుతుంటారు. ప్రస్తుతం విశాఖ నుంచి తిరుపతికి తిరుమల ఎక్స్‌ప్రెస్, డబుల్ డెక్కర్ రైలు నడుస్తున్నాయి. వీటిలో మూడు నెలల ముందు బుక్ చేసుకుంటే తప్ప బెర్తులు దొరకవు. ఈ మార్గంలో గరీబ్ రథ్ నడపాలని చాలాకాలంగా డిమాండ్ ఉంది. దీనిపై అనేకసార్లు రైల్వే అధికారులకు రైల్వే వినియోగదారుల సంఘం వినతిపత్రాలు సమర్పించింది. పట్టించుకోవడం లేదు. వందేభారత్ అయినా నడపొచ్చు. అదీ లేదు. విశాఖ నుంచి హైదరాబాద్‌కు ఎంత డిమాండ్ ఉందో తిరుపతికి కూడా అంతే డిమాండ్ ఉంది. కాబట్టి కొత్త రైలు వేయాల్సిన అవసరం ఉంది.చెన్నైకి విశాఖ నుంచి రైలే లేదు ప్రధాన వాణిజ్య కేంద్రమైన చెన్నైకు విశాఖ నుంచి ప్రారంభమయ్యే రైలు ఒక్కటి కూడా లేదు. ఎక్కడెక్కడో బయలుదేరి విశాఖ మీదుగా వెళ్లే కోరమండల్, మెయిల్ వంటి రైళ్లు ఉన్నా వాటిలో అతి తక్కువ సీట్లు విశాఖకు కేటాయిస్తున్నారు. విశాఖ నుంచే ప్రారంభమయ్యేలా ఒక రైలు రెగ్యులర్‌గా నడపాల్సి ఉంది. ప్రతి సోమవారం, శుక్రవారం విశాఖ నుంచి ప్రత్యేక రైలు నడుపుతున్నారు. డిమాండ్ ఉన్న మార్గంలో రెగ్యులర్‌గా రైలు వేయమంటే...వారానికి ఒకరోజో, రెండు రోజులో ప్రత్యేక రైలు నడిపి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంత పార్లమెంటు సభ్యులు విశాఖ నుంచి ప్రధాన నగరాలకు కొత్త రైళ్లు వచ్చేలా పనిచేయాల్సి ఉంది.

# స్టీల్‌ప్లాంటు పరిరక్షణే ధ్యేయం

**కూర్మన్నపాలెం -నవభూమి:** ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకూ కార్మికులు చేపట్టే పోరాటాలకు అండగా ఉంటామని విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు ప్రకటించారు. కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో 1311 రోజులుగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని శనివారం వారు సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఉక్కు కార్మికులను ఉద్దేశించి శ్రీభరత్ మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంలో పూర్తిస్థాయి ఉత్పత్తి జరిగేందుకు అవసరమైన నిర్ణయాలను కేంద్రం తీసుకునే విధంగా కృషిచేస్తానన్నారు. ఉత్పత్తి తగ్గడం, ఆర్థిక భారం ఎక్కువ కావడం, బ్లాస్ట్ ఫర్నేస్‌లు మూత పడడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారని, వారికి భరోసా కల్పించాలనే తాను వచ్చానన్నారు. మూడు నెలలుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర ఉక్కు మంత్రి, ఇతర కేంద్ర మంత్రుల మధ్య చర్చలు జరుగుతున్నాయని, వాటి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నామన్నారు. కేంద్ర ఉక్కు మంత్రి ఆది నుంచి ఉక్కు పరిరక్షణకు కృషిచేస్తానని హామీ ఇస్తున్నారన్నారు. ఉక్కు పరిరక్షణే అందరి ఏకైక ధ్యేయమన్నారు. ఉక్కు కర్మాగారాన్ని లాభాల్లోకి తేవడమే మన లక్ష్యమన్నారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ తొలి నుంచి తాను చెప్పే మాట ఒకటేనని, విశాఖ స్టీలుప్లాంటును పరిరక్షించకపోతే రాజీనామా చేసి, ఉక్కు కార్మికులతో పోరాటాల్లో పాల్గొంటానన్నారు. కార్మికులు, నిర్వాసితులు ఆందోళన చెందవద్దన్నారు. కార్మికుల పట్ల ఉక్కు యాజమాన్యం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలనూ, కర్మాగారం ఈ స్థితికి రావడానికి దారితీసిన పరిస్థితులను ప్రజా ప్రతినిధులకు కార్మికులు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, నాయకులు నల్లూరు సూర్యనారాయణ, ప్రసాదుల శ్రీనివాస్, ఉక్కు పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, ఎన్.రామారావు, కేవీఎన్ రావు, విళ్ల రామ్మోహన్‌కుమార్, వరసాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



## లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం




**మార్కాపురం, -నవభూమి:** రాజీమార్గం రాజమర్గమని మార్కాపురం సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.దేవేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కక్షిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా న్యాయాధికారి దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ న్యాయ విజ్ఞానాన్ని పెంపొందించుకో వాలన్నారు. ఈ సందర్భంగా 6వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.శుభవాణి, సీనియర్ సివిల్ న్యాయాధికారి దేవేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి జె.కిషోర్ కుమార్, అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.బాలాజీ లు ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించి నాలుగు బెంచీల ద్వారా 512 కేసులు పరిష్కరించారు. బెంచి సభ్యు లుగా బి.కాశయ్య, బేగం కరిమున్నీసా, కడియం రామ య్య, ఝాన్సీరాణి, అశోక్‌నాయక్, వెలుగొండయ్యలు వ్యవహ రించారు.గిద్దలూరు టౌన్ : స్థానిక కోర్టు భవనాల సముదాయంలో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో మొత్తం 418 కేసులు పరిష్కారం అయ్యాయి. రెండు బెంచులు ఏర్పాటు చేసి ఒక బెంచిలో సివిల్ కేసులు, మరో బెంచి నందు క్రిమినల్ కేసులు పరిష్కరించారు. 1వ బెంచికి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్, న్యాయవాద సభ్యులు గా బి.ఆనంద్‌కుమార్, పి.పోలయ్య వ్యవహరిం చారు. 2వ బెంచికి అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.మేరీసారాదానమ్మ, న్యాయ వాద సభ్యులు ఎం.పిచ్చయ్యయాదవ్, పి.సంధ్య రాణి వ్యవహరించారు. మొత్తం 418 కేసులు పరిష్కారం అయ్యాయి. ఆయా కేసుల్లో బాధితు లకు పరిహారం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అర్బన్ సీఐలు కె.సురేష్, రామకోటయ్య, న్యాయవాదులు ఎ.రవిప్రకాశ్‌బాబు, ఎం.ఎ.రైడర్ బాబు, జనార్దన్, ఆనంద్‌కుమార్, పారాలీగల్ వలంటీర్ ఎ.మధుసూదన్‌రావు పాల్గొన్నారు.హాస్టల్‌లో న్యాయాధికారి తనిఖీ పట్టణంలోని సాంఘీక సంక్షేమశాఖలోని ప్రభుత్వ బాలుర వసతిగృహం, గిరిజన సంక్షేమ పాఠశాలను జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న మెనూ పరిశీలించారు. సంవత్సర కాలంగా మెనూ బిల్లు రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గిరిజన పాఠశాల నందు అధ్యాపకులు లేకపోవడంపట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వసతిగృహం-2కు సరైన కాంపౌండ్ గోడ లేకపోవడం విచారకరమన్నారు. నిర్బంధ ఉచిత విద్య, న్యాయసేవాధికార చట్టం, ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## వరద బాధితులకు విరాళాలు

**మార్కాపురం, -నవభూమి:** స్థానిక బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరద బా?ధితులకు శనివారం రూ.2.20 లక్షల విలువైన 2 వేల దుప్పట్లను టీడీపీ నాయకులకు అందించారు. స్థానిక రథంబజార్‌లోని అసోసి యేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దుప్పట్లను టీడీపీ నాయకులు కందుల రామిరెడ్డి, వక్కలగడ్డ మల్లికార్జున్, తాళ్లపల్లి సత్యనారాయణలకు అందజేశారు. ఈ సందర్భంగా పోల్ మేనేజ్‌మెంట్ క్లస్టర్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి మాట్లాడుతూ వరద విలయా నికి విజయవాడ నగరం కుదేలైందన్నారు. ఎందరో పేదలు రోడ్డున పడ్డారన్నారు. ఆపదలో ఉన్నవారికి సాయం చేసేం దుకు బులియన్ మర్చంట్స్ అసోసి యేషన్ ముందుకు రావడం సంతోష కరమన్నారు. కార్యక్రమంలో బులి యన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తిరివీధి వెంకట సత్యనారాయణరావు, బైసాని కోటేశ్వర రావు, కోశాధికారి ఆరవీటి శివకేశవరావు, సభ్యులు, పలు బంగారు దుకాణాల యజమా నులు పాల్గొన్నారు.ఇటీవల విజయవాడ వరదకు నష్టపోయిన బాధితు లకు ఆదర్శ విద్యాసంస్థల తరఫున బుడత తిమ్మయ్య శనివారం ఎమ్మెల్యే ముత్తుము ల అశోక్‌రెడ్డికి 1లక్ష రూపా యల చెక్కును విరాళంగా అందచేశారు. ఎమ్మెల్యే అశోక్ రెడ్డి తిమ్మయ్యను అభినం దించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, టీడీపీ నాయకులు బైలడుగు బాలయ్య, దుత్తా బాలీశ్వరయ్య, బిల్లా రమేష్, ఎం.చంద్రశేఖర్, మాజీసర్పంచ్ వీరమ్మ, బిజెపి నాయకులు పిడతల రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.అన్నా క్యాంటిన్‌కు నాగేశ్వర గ్రూప్ ఆఫ్ ఆయుర్వేదిక్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ ఆకుల నగే ష్ లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించారు.

# బొర్రా గుహలకు మహర్దశ

**విశాఖపట్నం-నవభూమి:** ప్రపంచ ప్రఖ్యాతి చెందిన బొర్రా గుహలకు మహర్దశ పట్టనుంది. వీటిని అభివృద్ధి చేయడానికి, పర్యాటకులకు వసతి సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ 2.0 కింద రూ.30 కోట్లు మంజూరుచేసింది. వీటిలో రూ.24.1 కోట్లతో పూర్తిస్థాయిలో వసతులు కల్పించడానికి ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఆసక్తి వ్యక్తీకరణ కోసం ప్రకటన ఇచ్చింది. ఈ ప్రాజెక్టును నిర్మించి, నిర్వహించడానికి ఐదేళ్ల కాలానికి కాంట్రాక్టు ఇవ్వనుంది. ఇది పూర్తయితే బొర్రా వెళ్లే పర్యాటకులకు కొత్త అనుభూతి కలుగుతుంది. ప్రయాణం, పర్యటన సౌకర్యవంతంగా ఉంటుంది. దీనివల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.లక్షల ఏళ్ల చరిత్ర బొర్రా గుహలు ఈనాటివి కావు. 1500 లక్షల సంవత్సరాల చరిత్ర వాటి సొంతం. ఇవి విశాఖపట్నానికి 90 కి.మీ., ఏజెన్సీలో పర్యాటక కేంద్రమైన అరకులోయకు 38 కి.మీ. దూరంలో ఉన్నాయి. సముద్ర మట్టానికి 1,400 మీటర్ల ఎత్తున ఉన్నాయి. దేశంలోని అతి పెద్ద గుహల్లో ఇవి ఉన్నాయి. వీటిని చూడాలంటే బొర్రా రైల్వే స్టేషన్‌లో దిగి కిలోమీటరు ప్రయాణం చేయాలి. దీని కోసం జీపులు, ఆటోలు ఉంటాయి. 5.89 ఎకరాల్లో అభివృద్ధి పనులు బొర్రా గుహలకు రోజూ వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. కానీ వారికి సరైన ప్రయాణ, పార్కింగ్, వసతి సౌకర్యాలు లేవు. ఈ నేపథ్యంలో 5.89 ఎకరాల్లో రూ.24 కోట్లతో సౌకర్యాలు సమకూర్చాలని ఏపీటీడీసీ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో అచ్చంగా రెండు ఎకరాల స్థలాన్ని పార్కింగ్‌కు కేటాయించారు. అలాగే బొర్రా



గుహలకు వెళ్లే మార్గంలో అందమైన ద్వారం, గుహల వద్ద మరో ద్వారం నిర్మిస్తారు. ఆ ప్రాంతం వాహనాల పొగతో కాలుష్యమయం కాకుండా ఎలక్ట్రిక్ వాహనాలను నడుపుతారు. వాటి ద్వారా పర్యాటకులను గుహలకు తీసుకువెళ్లి తీసుకువస్తారు. పర్యాటకుల కోసం టాయిలెట్లు, లగేజీ భద్రపరుచుకునే గదులు, తాగునీటి సౌకర్యం కల్పిస్తారు.ప్రత్యేకంగా మార్కెట్ స్ట్రీట్ బొర్రా గుహల ముందు గిరిజనులు తయారుచేసిన, పండించిన వాటిని విక్రయిస్తున్నారు. దీనిని మార్కెట్ స్ట్రీట్‌గా అభివృద్ధి చేస్తారు. రెండు వైపులా ఫుట్‌పాత్‌లు నిర్మిస్తారు. పర్యాటకులు పక్కనే ఉన్న లోయ అందాలను తిలకించేందుకు వ్యూపాయింట్లు, విజువల్ డెక్ ఏర్పాటుచేస్తారు. సిటింగ్ ఏరియా ఉంటుంది. అడ్వంచర్ స్పోర్ట్స్, ఎగ్జిబిషన్ వంటివి పెడతారు.విజటర్స్ కౌంటర్ పర్యాటకుల వసతి కోసం రెండు అంతస్థుల భవనం నిర్మిస్తారు. ఇక్కడే టికెట్లు, బ్యాగేజీ, రెస్టారెంట్ వంటి సౌకర్యాలు ఉంటాయి. ఇక గుహల లోపల అవసరమైన ప్రాంతాల్లో స్టెయిర్ కేసులు, రెయిలింగ్‌లు పెడతారు. కొత్తగా విద్యుద్దీపాలు అమరుస్తారు. సీసీ టీవీ కెమెరాలు వంటివి ఉంటాయి.సౌండ్ అండ్ లైటింగ్ షో గుహ లోపలి అందాలను విభిన్న కోణాల్లో చూపించడానికి సౌండ్ అండ్ లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటుచేస్తారు. దాంతో కళ్ల ముందు రంగుల ప్రపంచం ఆవిష్కృతమవుతుంది. ఇది మరిచిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. ఈ ప్రాజెక్టుకు టెండర్లు సమర్పించడానికి ఈ నెల 24వ తేదీ వరకు గడువు ఇచ్చినట్టు పర్యాటక శాఖ ప్రాంతీయ డైరెక్టర్ శ్రీనివాస పాణి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

# కొత్త సరుకు రావాల్సిందే

**భీమవరం -నవభూమి:** మరో రెండు వారాల్లోనే కొత్త మద్యం విధానం రాష్ట్రం ఎదుట సాక్షాత్కరిం చబోతుంది. మద్యం ప్రియులంతా ఈ విధానంపైనే ఎదురు చూస్తున్నారు. తాము ఆశించినట్టుగా 2019 ముందు వరకు ఉన్న మద్యం సరుకు అంత తిరిగి మార్కెట్‌లోకి తిరిగివస్తుందని భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలు కొత్త జిల్లాలుగా విడిపోయిన తర్వాత జిల్లా ప్రాతిపదికనే దుకాణాలు పెంచడం, లేదా తగ్గించడం జరుగుతుందని ఇప్పటికే ఒక స్పష్టత వచ్చేసినట్టు ప్రచారం. పశ్చిమ గోదావరి జిల్లాలో గత ప్రభుత్వం 202 ప్రభుత్వ మద్యం దుకాణాలు, 25 బార్లను ఏర్పాటు చేసింది. వీటిల్లో రోజుకు సగటున రూ.నాలు గు కోట్ల వరకు విక్రయాలు సాగుతున్నాయి. ప్రైవేటు వ్యక్తులు దుకాణాలు ఏర్పాటు చేస్తే రోజుకు రూ.6 కోట్ల వరకు విక్రయాలు జరిగే అవకాశం వుంది. సూపర్‌బజార్‌ను తలపించే మాల్స్‌కు శ్రీకారం చుట్టి అమ్మకాల ఒరవడిని పెంచింది. కొత్త మద్యం విధానంలో ఈ మాల్స్‌కు మంగళం పాడబోతున్నా రంటూ ప్రచారం. దానికి తగ్గట్టుగానే గడిచిన 45 రోజులుగా మాల్స్‌లో ఇంత కు ముందున్న సరుకు విడుదల కాస్తా ఈ మధ్యన పూర్తిగా తగ్గించివేశారు. వాస్తవానికి జగన్ హయాంలో మద్యపాన నిషేధం పేరిట హడావుడి చేసి చివరకు ఎడాపెడా రకరకాల బ్రాండ్‌లను మార్కెట్‌లోకి చొప్పించి మద్యం ప్రియులకు బలవంతంగా అంటగట్టారు. దీనికితోడు ఏ రోజుకారోజు కష్టపడి కూలీనాలి చేసుకునే వారికి సైతం 120, 130 రూపాయల రకాలు వద్దాన్నా అంటకట్టారు. ఇదే నగరాలతోపాటు గ్రామాల్లోను వందలాది మంది యువకు ల ప్రాణాలు గాలిలో కలిసేలా చేశాయంటూ ఆరోపణలు. ఇలాంటి పరిస్థితు ల్లో కొత్త మద్యం పాలసీలో ఎక్కడికక్కడ దుకాణాల సంఖ్యను పెంచడం, గతంలో మాదిరిగానే ఇవన్నీ ప్రభుత్వం నిర్వహించే వేలం పాటల్లో దక్కించు కున్న ప్రైవేటు వ్యక్తులు నిర్వహించే పరిస్థితులు ఈసారి కూడా తిరిగి పునరావృతం అయ్యేలా ఉన్నాయి. అయితే గతంలో మద్యం దుకాణాలకు నిర్వహించే వేలంలో నాన్ రిఫండ్ పేరిట ప్రతి దుకాణంకు రూ.లక్ష ఉండగా, ఈసారి అది రూ.రెండు లక్షలకు పెంచబోతున్నారు. ఎవరైతే వేలం పాటలో పాల్గొంటారో వారంతా ప్రభుత్వం నిర్దేశించిన దరావత్తును విధిగా చెల్లించాలి. దుకాణం దక్కినా, దక్కకపోయినా ఈ దరావత్తు సొమ్ము ప్రభుత్వ ఖాతాలోనే జమ అవుతుంది. సరిగ్గా ఆ విధానాన్నే ఈసారి పాటించబోతున్నట్టు చెబుతు న్నారు. జగన్ హయాంలో ఎవరూ చూడని, వినని దాదాపు 22 రకాల బ్రాండ్ లన్నీ వచ్చిపడ్డాయి. ఇప్పుడావన్నీ మాయమవుతాయి. ఆ స్థానంలో అందరూ కోరుకునే బ్రాండ్‌లకే ప్రాధాన్యత ఇవ్వబోతున్నట్టు చెబుతున్నారు.కొత్త ముఖాల ఆతృత కొత్త మద్యం విధానం ఇప్పటి వరకు ప్రకటించలేదు. అయినా మద్యం వ్యాపారంతో ఎలాంటి సంబంధం లేని వ్యక్తులు ఈసారి రంగంలోకి దిగి దుకాణాలను చేజిక్కించుకోవాలని ఆతృతతో ఉన్నారు. ఇంతకు ముందు కేవలం ఒక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులే మద్యం వ్యాపారంలో కాస్తంత పెట్టుబడులు పెట్టేవారు. కాని ఈసారి అటువంటి వారికి దీటుగా ఐదుగురి నుంచి పది మంది వరకు ఒక సిండికేట్‌గా మారి తమ ప్రాంతంలో దుకాణాల వేలంలో పాల్గొనాలని ఆతృత పడుతున్నారు. ఏలూరు, భీమవరంతోపాటు మిగిలిన నియోజకవర్గ కేంద్రాల్లోను కొన్ని దుకాణాలను గుర్తించి అవి తమ ఆధీనంలోనే ఉండేలా ఇప్పటికే ఎత్తుగడలు వేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేతో పనిలేకుండా ముందుగా రంగంలోకి దిగడం, ఆ తరువాతే ఎమ్మెల్యేతోపాటు ఇతర నేతలను సంప్రదించాలని భావిస్తున్న వారు లేకపోలేదు. ఏలూరు నగరంలో దుకాణాల సంఖ్య ఈసారి 25కుపైగానే ఉంటాయని అంచనా వేస్తున్న ఇంకొందరు ఆ దిశగానే రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇంకొందరు సిండికేట్‌గా మారి ప్రతీ దుకాణంలోను తమ వాటా ఉండేలా ఎత్తుగడలకు కత్తులు నూరుతున్నారు.

